క్లుప్తంగా

పలువురు వైద్యులకు సన్మానం



పొన్నూరు: లయన్స్ క్లబ్ ఆఫ్ పొన్నూరు స్వర్ణపురి మహిళ ఆధ్వర్యంలో సోమవారం ఇంటర్నేషనల్ డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు మన్నవ అనసూయాదేవి అధ్యక్షతన జరిగిన సభలో పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్. మన్నె సాయి బాబు, డాక్టర్. ఏ. కోటిరెడ్డిలను ఘనంగా సన్మానించారు.. లయన్ లేడీస్ అందరూ పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పి. శేషకుమారి, ట్రెజరర్ బి. శబలాదేవి, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ముందు వెళుతున్న లారీని వెనుకనుంచి ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామానికి చెందిన నేలపాటి ఉదయ్‌కిరణ్ (23) గుంటూరు నుంచి అర్ధరాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్నాడు. ఎన్‌హెచ్ 16 వై జంక్షన్ సమీపంలో ముందు వెళుతున్న లారీని వెనుకనుంచి ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రగాయాలు కాగా అదే సమయంలో వెనుక నుంచి వెళుతున్న మరో కారు అతనిని ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలిలించి, మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గ్రీవెన్స్‌కు నాలుగు అర్జీలు

పొన్నూరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి నాలుగు అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ సూర్యనారాయణ సింగ్ తెలిపారు. పోలీస్ సంబంధించిన అర్జీతో పాటు రెండు పొలం సర్వే కోసం వచ్చినట్లు తెలిపారు. కోర్టు సంబంధిత సమస్యపై అర్జీ అందినట్లు తెలిపారు. ప్రజల నుంచి స్వీకరించిన సమస్యలను సంబంధిత అధికారులకు పంపి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. పట్టణ, మండల పరిధిలో సోమవారం నుంచి రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎండీయూ వాహనాల ద్వారానే బియ్యం అందజేయనున్నట్లు తెలిపారు.

స్థానిక సంస్థలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కొనసాగించాలి



నెహ్రూనగర్: జనాభా దామాషా ప్రకారం బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కొనసాగించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కుల జనగణన చేపట్టి స్పష్టీకరించాలని కోరారు. ప్రస్తుత గణాంకాల ప్రకారం బీసీ లు 52% శాతంగా ఉన్నారని.. ఈ దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో 34% శాతం రిజర్వేషన్‌ను అమలు పరచాలన్నారు. బీసీల పక్షపాతి, బీసీల ప్రభుత్వం అని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో బీసీలకు అండగా ఉండాలని కోరారు. టీడీపీ ప్రభుత్వం ఈ రిజర్వేషన్‌పై ఒక కమిటీ వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, పూర్ణ చంద్ర, గోపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ

నెహ్రూనగర్: ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ- 2024 పరీక్షలకు సన్నద్ధమయ్యే బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డి.మధుసూదనరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టెట్ క్వాలిఫై అయిన 200 మంది అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ కూడా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదో తరగతి, టీటీసీ, బీఎడ్ మార్క్ లిస్టులు, టెట్ మార్క్ లిస్టులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం లక్ష లోపు, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జత చేసి జూలై 7వ తేదీలోగా రాజాగారితోటలోని బీసీ స్టడీ సర్కిల్, గుంటూరు కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 0863-2358071 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

వేర్వేరు ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ

- ఇంటింటికీ వెళ్లి నగదు పంచిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల
- తాడిపర్రులో పింఛన్ అందజేసిన జెడ్పీ సీఈఓ



వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు: పొన్నూరులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమం గంటల పాటు సర్వర్ అంతరాయం ఏర్పడినా సాయంత్రానికి లక్ష్యానికి చేరుకుంది. పట్టణ, మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభలతో పాటు ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పింఛన్ పంపిణీ చేశారు. పచ్చల తాడిపర్రు గ్రామంలో జెడ్పీ సీఈఓ వసంతరాయుడు పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం వృద్ధులు, ఒంటరి, వితంతు, తదితర లబ్ధిదారులకు రూ. 7 వేలు అందించినట్లు తెలిపారు. దివ్యాంగులకు రూ. 6 వేలు అందించామన్నారు. వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 10.156 పింఛన్లు ఉండగా రూ. 6 కోట్ల72 లక్షల 30 వేలు లబ్ధిదారులకు అందించాల్సి ఉండగా 89 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో రత్నజ్యోతి తెలిపారు. ఉదయం 8.30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సర్వర్‌లో అంతరాయం ఏర్పడిందని తెలిపారు. పట్టణంలో 5,950 మంది లబ్ధిదారులకు రూ. 4 కోట్ల 9 లక్షల 41వేలు అందించాల్సి ఉండగా సోమవారం సాయంత్రానికి 94 శాతం పూర్తయినట్లు మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయులు, కూటమి నేతలు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే మండలంలో సోమవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం కూటమి నేతలు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలోనే కొనసాగింది. మండల పరిధిలోని ప్రజా ప్రతినిధులైన ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు దూరంగా ఉండటం గమనార్హం.

చేబ్రోలు మండలంలో..

చేబ్రోలు: మండలంలో సోమవారం ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం 96 శాతం పూర్తి అయినట్లు మండలాధికారులు తెలిపారు. చేబ్రోలు మండలంలోని 17గ్రామ సచివాలయాల పరిధిలో 10346 మంది పెన్షన్‌దారులు ఉన్నారు. గతంలో వలంటీర్ల ద్వారాపెన్షన్ల పంపిణీ జరగ్గా ప్రస్తుత ప్రభుత్వం నూతనంగా సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందజేసింది. వృద్ధాప్య, వితంతు, వికలాంగ తదితర పెన్షన్ల లబ్ధిదారులకు 9982మందికి సచివాలయ సిబ్బంది అందజేశారు. చేబ్రోలులోని ఉప్పరపాలెంలో పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన విధంగా మొదటినెల పెన్షన్‌దారులకు ఏడువేల రూపాయల చొప్పున అందజేశారు. మండల పరిధిలోని గుండవరం గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ సర్పంచ్ చుక్కా సాయి నాగేంద్రమ్మ లబ్ధిదారులకు పెన్షన్‌లను అందజేసి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న జెడ్పీ సీఈఓ వసంతరాయుడు



గుండవరంలో వృద్ధాప్య పెన్షన్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ చుక్కా సాయి నాగేంద్రమ్మ

ప్రజా సమస్యలపై స్పందించని అధికారులు



నిరసన తెలియజేస్తున్న మండల సీపీఎం కార్యదర్శి నన్నపనేని శివాజి, నాయకులు

పెదకాకాని: ఏళ్ల తరబడి ప్రభుత్వ భూముల్లో ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని మండల సీపీఎం కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. పెదకాకానిలో ఇళ్లు నిర్మించుకుని నివశిస్తున్న వారందరీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి కోరుతూ సోమవారం గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. అనంతరం పెదకాకాని తహసీల్దార్ కార్యాలయం అనంతరం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో 2007వ సంవత్సరం నుంచి నిరుపేదలు సుందరయ్య కాలనీ, స్వర్ణపురి కాలనీ, ఎస్టీకాలనీ, ఎన్టీఆర్ కాలనీ, వడ్డెర కాలనీ, తదితర కాలనీల్లో ఇండ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వలేదని స్థానిక ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర కుమార్ చెప్పినా అధికారులలో ఎటువంటి స్పందన లేదని, చెప్పులు అరిగేలాగా ఆఫీసుల చుట్టూ తిరిగి అనేకసార్లు అర్జీలు ఇచ్చినా చెత్తబుట్టలో వేస్తున్నారన్నారు. సుందరయ్య కాలనీలో రోడ్లు చాలా అధ్వాన్నంగా ఉన్నాయని వర్షం పడితే వృద్ధులు, పిల్లలు రోడ్లపై నడవాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్వర్ణ పూరి కాలనీ ఎన్టీఆర్ కాలనీల్లో రోడ్లు వేశారు కానీ తాగటానికి మంచి నీరు లేదని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా అధికారులతో స్థానిక శాసనసభ్యులు మాట్లాడినా అధికారులలోఎటువంటి స్పందన లేదని, తక్షణమే ప్రభుత్వం భూముల్లో ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని రోడ్లు, డ్రెయినేజీ, మంచినీటి సౌకర్యం, మౌలిక వసతులు కల్పించాలని లేని పక్షంలో దశల వారి ఆందోళన చేపడతామని శివాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బురదగుంట సాంబయ్య, జి.రాజా రమేష్, ఎ.నాగేశ్వరావు, సి.హెచ్.రామకృష్ణ, జెట్టి రాజ్యలక్ష్మి, నంబూరు లక్ష్మి, డి మల్లేశ్వరి పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ



ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలను పొందిన విద్యార్థులు

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించి వారికి ఉజ్వల భవిష్యత్‌ను అందించటం తమ కళాశాల లక్ష్యమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో కొబెల్కో కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో తమ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఏడు మంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించారన్నారు. సంస్థ విద్యార్థులతో ఏడాదికి రూ 4.2 లక్షల రూపాయల ప్యాకేజీతో ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. 2023-24 వార్షిక విద్యా సంవత్సరానికి ఇప్పటి వరకూ 600 మంది విద్యార్థులకు పైగా ఉద్యోగాలు సాధించారని కళాశాల అధ్యక్షుడు తెలిపారు. కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్‌గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు వివిధ అంతర్జాతీయ కోర్ కంపెనీలతో పాటుగా సాఫ్ట్ వెర్ కంపెనీలలో అధిక ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధించుకున్నారని తెలిపారు. టీసీఎస్ డీ కంపెనీలో రూ.7 లక్షల రూపాయల ప్యాకేజీతో, రీనెక్స్ టెక్నాలజీ, హోం ఫస్ట్ ఫైనాన్స్, హ్యుండై కంపెనీలలో రూ 5 లక్షల రూపాయల ప్యాకేజీలతో, ఎసెంచర్ కంపెనీలో రూ.4.5 లక్షల ప్యాకేజీతో, ఆసీమిగ్రేడ్ కంపెనీలో రూ.4 లక్షల ప్యాకేజీలతో పాటుగా వివిధ కంపెనీలలో ఉద్యోగాలు సాధించుకోవడం ఆనందదాయకమన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ డీవీవీ కృష్ణప్రసాద్, సీహెచ్ శ్రీనివాసరావు అభినందించారు.

ఇసుక అందుబాటులో లేక కార్మికుల ఇబ్బందులు

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ



సభలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

పొన్నూరు: కార్మికుల మనుగడ కోసం భవన నిర్మాణాలకు అవసరమైన ఇసుకను వెంటనే అందుబాటులోకి తేవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మాచవరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ప్రస్తుతం ఇసుక అందుబాటులో లేకపోవడంతో కార్మికులు పనులు కోల్పోయి, కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఇసుక సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని చెప్పిన హామీని అమలు చేయాలని కోరారు. వెంటనే సంక్షేమం బోర్డును పునరుద్ధరించి, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ పరిష్కరించాలని కోరారు. ముఖ్యమంత్రి రాజధాని నిర్మాణం చేపట్టడానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని అదే సందర్భంలో రాజధాని నిర్మాణంలో స్థానికులకు పనులు కల్పించాలని కోరారు. గతంలో మాదిరిగా ఇతర రాష్ట్రాల కార్మికులను తెచ్చి, స్థానికులకు అవకాశం లేకుండా చేశారని అన్నారు. ఈ పద్ధతి పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. మండల కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ చంద్రన్న భీమా కార్మికులందరికీ వర్తింప చేయాలని కోరారు. సమావేశంలో మిక్కిలి దుర్గయ్య, శ్రీనివాసరావు, బాజీ, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు



నాక్ ఏ గ్రేడ్ సర్టిఫికెట్‌ను అందుకుంటున్న డాక్టర్ సిస్టర్ ఫాతిమారాణి

గుంటూరు రూరల్: నైపుణ్యతతో కూడిన విద్యావిధానం ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు తమ కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుందని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ డాక్టర్ సిస్టర్ ఫాతిమారాణి పి తెలిపారు. సోమవారం గోరంట్ల గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కళాశాలల్లో నాణ్యత ప్రమాణాలపై అందించే గుర్తింపు ప్రక్రియలో భాగంగా మొదటి సైకిల్‌లోనే తమ కళాశాలకు నేషనల్ ఎసెస్‌మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ (నాక్) ఏ గ్రేడ్ గుర్తింపును తమ కళాశాలకు అదించిందన్నారు. ఈ సందర్భంగా నాక్ గ్రేడ్ పొందేందుకు కృషిచేసిన సహకరించిన కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతరులకు ప్రిన్సిపల్ కృతజ్ఞతలు తెలిపారు.

కంట్రోల్ ప్రోగ్రామింగ్ పై అధ్యాపకులకు శిక్షణ



అధ్యాపకులతో ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జున రెడ్డి , ఇతర అధ్యాపక బృందం

పెదకాకాని: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ, సాంకేతిక విద్య, శిక్షణామండలి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్, చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజుల పాటు కంప్యూటర్ నందు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైందని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు.

పెదకాకాని మండలంలోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాలకు చెందిన సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నందు ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకులకు నిర్వ హించనున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ విపద్మారావు, వీవీఐటీ ప్రిన్సిపల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డిలు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ మెకానికల్ విభాగం అధ్యాపకులకు సీఎస్‌సీ మిషన్స్, ప్రోగ్రామింగ్ తదితర సాంకేతిక అంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐటీటీటీఆర్, చెన్నై ప్రొఫెసర్ బాల సుబ్రమణ్యన్, వీవీఐటీ విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాసరావు, డైరెక్టర్ డాక్టర్ రావెల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వ్యాధులపై నిర్లక్ష్యం తగదు



లక్ష్మీపురం: పంచేంద్రియాలలో అతి ముఖ్యమైన నయనం విషయంలో అప్రమత్తంగా ఉండాలని, కంటి వ్యాధులపై నిర్లక్ష్యం తగదని నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ పద్మ ప్రియ అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆరోగ్య సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నలభై ఏళ్లు పైబడిన వారు కంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని కోరారు. శుక్లాలు, నీటి కాసుల వ్యాధులు ఈ మధ్య చాలా ఎక్కువగా వస్తున్నాయన్నారు. చూపుకి అడ్డు పడి చికాకు కలిగించే ఫ్లోటర్స్ సమస్య ఉన్నప్పుడు మాత్రం డాక్టర్‌ని సంప్రదించాలన్నారు. ఆకు కూరలు, పండ్లు వంటివి తీసుకోవడం వల్ల కంటి చూపు మెరుగ్గా ఉంటుందని వైద్యురాలు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ పద్మప్రియను ఘనంగా సత్కరించారు.

గణపయ్యా.. ఇదేమిటయ్యా!

- ధూప దీప నైవేద్యాలకూ ఆటంకాలే!
- వెనిగండ్లలో విఘ్నేశ్వరస్వామి ఆలయానికి తాళాలు



అధికారులు తాళాలు వేయడంతో పూజలకు నోచుకోని విఘ్నేశ్వరుని ఆలయం

పెదకాకాని: ఏళ్ల తరబడి పూజలందుకుంటున్న విఘ్నేశ్వరుని ఆలయంలో పంచాయతీ అధికారుల నిర్వాకం కారణంగా ధూప, దీప, నైవేద్యాలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల మైత్రి కల్యాణ మండపం ప్రాంగణంలో నిర్మించిన విఘ్నేశ్వరుని ఆలయానికి వేసిన తాళాలు తీయడం లేదు. కల్యాణ మండపం నిర్మించుకున్న గ్రామస్తులు ఆ ప్రాంగణంలో చందాలు వేసుకుని విఘ్నేశ్వరుని ఆలయాన్ని నిర్మించుకున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఆలయంలో దీపారాధన చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించి పూజలు చేస్తున్నారు. అలానే ప్రతి శుక్రవారం రాత్రి మహిళా భక్తులు ఆలయంలో భజనలు చేస్తున్నారు. గత పదిరోజులుగా ఆలయానికి వేసిన తాళాలు తీయడం లేదు. దీంతో స్వామి వారికి దీపారాధన, నైవేద్యం పెట్టడం కూడా నిలిపోయాయి. పంచాయతీ అధికారులను తాళాలు తీయమని కోరగా సరైన సమాధానం కూడా చెప్పడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దీనిపై పంచాయితీ ఇన్‌చార్జి కార్యదర్శి జి.హరిబాబును వివరణ కోరగా భక్తుల కోరిక మేరకు ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకూ, సాయంత్రం 5 గంటల నుంచి 9 గంటల వరకూ తాళాలు తీసి ఉంచాలని సిబ్బందికి తెలియజేశానన్నారు.. అయితే చెప్పిన మాట వినకుండా ఇష్టం వచ్చినట్లు చేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆలయంలో దూప దీప నైవేద్యాలకు ఆటంకం కలుగకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.


నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



పట్నంబజారులోని ఓ షాపులో స్టాక్ రిజిస్టరును పరిశీలిస్తున్న ఏడీఏ సునీల్, ఏఓ సుబ్రహ్మణ్యం

కొరిటిపాడు(గుంటూరు): రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని వ్యవసాయశాఖ గుంటూరు సహాయ సంచాలకులు ఎం.సునీల్ సూచించారు. రైతులకు నాసిరకం, కల్తీ విత్తనాలు అంటగడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్నంబజారులోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల షాపులను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. లైసెన్స్‌లు, స్టాకు రిజిస్టార్లు తనిఖీ చేసి గోడౌన్లలోని నిల్వలను పరిశీలించారు. పలు షాపుల్లో స్టాక్ బోర్డు, ధరల పట్టిక లేనందున, సరిగా అప్‌డేట్ చేయనందున రూ.11.71 లక్షల విలువ చేసే 2,125 లీటర్ల పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఏడీఏ సునీల్ మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా నిర్వహించకుండా, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల అమ్మకంపై రికార్డులు నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, నాసిరకమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్మితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఆర్‌పీ మించి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఒకటికి రెండుసార్లు పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. తనిఖీల్లో గుంటూరు రూరల్ ఏఓ వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో ప్రజారోగ్య సిబ్బంది పాత్ర కీలకం



పదవీ విరమణ చేసిన ప్రజారోగ్య సిబ్బందితో కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగర పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణలో నగరపాలక సంస్థ ప్రజారోగ్య సిబ్బంది కృషి వెలకట్టలేనిదని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. సోమవారం ఉద్యోగ విరమణ చేస్తున్న 12 మంది ప్రజారోగ్య, ఇంజినీరింగ్ కార్మికులకు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సన్మాన సభ ఏర్పాటు చేసి అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పారిశుద్ధ్య పనులు చేస్తున్నారన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న కార్మికులకు నగరపాలక సంస్థ తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నగరంలో ప్రజారోగ్య కార్మికులు లేకుంటే ప్రజారోగ్యం పెను ప్రమాదంలో పడుతుందన్నారు. ఉద్యోగ విరమణ చేసిన 12 మందికి నగరపాలక సంస్థ నుంచి అందాల్సిన పీఎఫ్ బెనిఫిట్స్ రూ.93,96,545లను అందించామని, ఇతర బెనిఫిట్స్ కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మీ, ఎంహెచ్ఓ మధుసూదన్, ఎస్.ఈ శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక ప్రగతిలో సీఏల పాత్ర కీలకం

ఘనంగా సీఏ దినోత్సవం



సీఏ దినోత్సవంలో ఐసీఏఐ ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ ఆర్థిక ప్రగతిలో చార్టర్డ్ అకౌంటెంట్ల పాత్ర ఎంతో కీలకమని చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు పేర్కొన్నారు. శ్రీనివాసరావు తోటలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గుంటూరు శాఖ ఆధ్వర్యంలో సోమవారం సీఏ దినోత్సవం సందర్భంగా పతాక ఆవిష్కరణ, రక్తదాన శిబిరం, మొక్కల పంపిణీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ సీఏ విద్యను ఎంపిక చేసుకోవడం బంగారు భవిష్యత్తుకు పునాది వేసుకోవడమన్నారు. సీఏ విద్యకు గుంటూరు ముఖ్య కేంద్రంగా ఉందని చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఎంతో మంది విద్యార్థులు సీఏ అభ్యశించేందుకు ఇక్కడికి వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఐ గుంటూరు శాఖ చైర్మన్ నూతలపాటి అమర్‌నాథ్, వైస్ చైర్మన్ చింతా రఘునందన్, కార్యదర్శి రుద్రవరపు భరద్వాజ, కోశాధికారి నరేష్, సికాస చైర్మన్ కన్నెగంటి మృత్యుంజయరావు, పాస్ట్ చైర్మన్ మద్ది రవితేజ, కమిటీ సభ్యురాలు వంగల భార్గవి, సీఏలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చరిత్రను తిరగరాసిన టీం ఇండియా

లక్ష్మీపురం: పదిహేడేళ్ల తపన టీ20 వరల్డ్ కప్ విజయంతో తీరిందని, తిరుగు లేని టీం ఇండియా విజయం దేశానికి గర్వకారణమని గాయకుడు వీఎస్ఎన్ మల్లేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. టాస్ గెలవడం శుభారంభమైతే.. భారీ స్కోరు భారత్ విజయానికి సంకేతమన్నారు. సంస్థ సీనియర్ సభ్యులు ఎల్.మురళీకృష్ణ, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ టన్నుల కొద్ది టాలెంట్ ఉన్నా అందకుండా ఊరిస్తున్న టీ20 టైటిల్ టీం ఇండియా దరి చేరిందన్నారు. టీం ఇండియాకు సంస్థ తరుపున అభినందనలు తెలిపారు.

4న విద్యా సంస్థల బంద్

లక్ష్మీపురం: నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ విద్యార్థి సంఘాలు ఈ నెల 4న దేశంలోని అన్ని విద్యా సంస్థల బందుకు పిలుపునిచ్చినట్లు ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ పేర్కొన్నారు. స్థానిక బ్రాడి పేటలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో సోమవారం పలు విద్యార్థి సంఘాలు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. నీట్ రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని, జీఓ నంబరు 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలన్నారు. వీటితో పలు డిమాండ్లతో జూలై 4న దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ బంద్‌లో విద్యార్థులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాజర్ జి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కరీం విద్యా విధానంలో కేంద్రం వైఫల్యాలపై తమ గళం వినిపించారు. బంద్‌కు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, నాయకులు యశ్వంత్, భగత్‌సింగ్, పద్మ, రూపస్, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి శశి, అజయ్, బన్నీ, ఎన్ఎస్‌యూఐ నాయకులు తిరుమలరావు పాల్గొన్నారు.